## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై అవగాహన



యర్రవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి రామరాజువర్మ, సబ్‌యూనిట్ అధికారి ఆనంద్ గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సౌజన్య, ప్రశాంతదీప్తి, సుమలత, భవాని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులతో కెనేరియా పెద్దలు

తుని: చెన్నైలో జరిగిన కెనేరియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తుని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జపాన్ కరాటే దూ కెనేరియా ఇండియా ఆధ్వర్యంలో చెన్నైలో ఆదివారం చాంపియాన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తుని కెనేరియా కరాటే అకాడమి విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలుర అండర్ 11 జూనియర్ విభాగంలో కె. ప్రదీప్ కటాలో గోల్డ్‌మెడల్, కుమిట్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. అండర్ 11 జూనియర్ బాలికల కేటగిరిలో కె.నక్షత్ర కటలో గోల్డ్‌మెడల్, కుమిట్‌లో బ్రాంజ్ మెడల్, అండర్ 9 బాలుర విభాగంలో ఎ.అవినాష్ కటలో బ్రాంజ్ మెడల్ సాధించి విజేతలుగా నిలిచారు. విజేతలను కెనేరియా ఇండియా చీఫ్ గిరీష్, స్టేట్ చీఫ్ కె.సుమన్, డిస్ట్రిక్ చీఫ్ కె.శివకుమార్ తదితరులు అభినందించారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని ఏలూరులో రూ.40.7 లక్షలు, ఉత్తరకంచిలో రూ.29.7 లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంకుల నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు రొంగల సత్యనారాయణ, మంతిన శ్రీను, జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు పాల్గొన్నారు.

### సారా బట్టీలపై పోలీసుల దాడి

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో సారా బట్టీలపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి పాల్పడుతున్న బోయిన వీర్రాజును అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథ్‌బాబు తెలిపారు. అలాగే ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా సారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

ప్రత్తిపాడు రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నలుగురికి రెండు రోజులు జైలు శిక్ష, మరో ఆరుగురికి రూ.10 వేలు చొప్పన జరిమానా విధిస్తూ పెద్దాపురం కోర్టు జడ్జి బుల్లమ్మ తీర్పునిచ్చినట్లు స్థానిక ఎస్సై పవన్ కుమార్ మంగళవారం తెలిపారు. గతంలో ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు తెలిపారు.

### గణపతి నవరాత్రులకు చురుగ్గా ఏర్పాట్లు

తొండంగి: గణపతి నవరాత్ర ఉత్సవాలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో ఏర్పాట్లు మొదలయ్యాయి. వచ్చే నెల 7న వినాయక చవితి కావడంతో మండలంలోని రావికంపాడు, శృంగవృక్షం తదితర గ్రామాల్లో గణపతి మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు చలువ పందిళ్లు, విద్యుత్ సెట్టింగులు ఏర్పాటు చేసే పనిలో బిజీగా ఉన్నారు.

### ప్రజల్లో అవగాహన పెంచాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన సిగ్గుచేటు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, మొదట ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. రాత్రిపూట విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతపై పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి.

– డాక్టర్ శ్రావణి, పులిమేరు పీహెచ్‌సీ వైద్యురాలు, పెద్దాపురం మండలం



### దోషులను కఠినంగా శిక్షించాలి



ఇటీవల కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన అమానుషం. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ కల్పించాలి. వైద్యులపై దాడి చేస్తే కఠిన శిక్షలు పడేలా చట్టాలు ఉండాలి. కొందరు మద్యం తాగి వచ్చి వైద్యులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. పీహెచ్‌సీల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ ఐ.రత్నంబాబు, వైద్యాధికారి, పెద్దిపాలెం పీహెచ్‌సీ, ప్రత్తిపాడు రూరల్

# మూగజీవాలకు గాలికుంటు ముప్పు

- పశువుల్లో వ్యాప్తి చెందుతున్న ప్రాణాంతక వ్యాధి
- ఆందోళన చేందుతున్న పాడి రైతులు
- వ్యాధి నివారణకు జోరుగా వ్యాక్సినేషన్



ప్రత్తిపాడులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సహాయకురాలు

ప్రత్తిపాడు/రౌతులపూడి: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు తొందరగా వ్యాపిస్తాయి. ఈ సీజన్ వచ్చిందంటే చాలు ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి పశువుల్లో వ్యాప్తి చెందుతుంది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు వంటి చీలు గిట్టలుండే జంతువుల్లో సంభవించే తీవ్రమైన వైరల్ అంటువ్యాధి ఇది. గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. గాలికుంటు వ్యాధిని కలుగచేసే వైరస్ గాలి ద్వారా వ్యాపించి పశువులకు వ్యాధి సోకేందుకు దోహదపడుతోంది.

**నియోజకవర్గంలో పశువుల వివరాలు**

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 40,492 గేదెలు, 11,443 ఆవులు వెరసి 51,935 పశువులు ఉన్నాయి. గేదెలు, ఆవుల్లో ఈ వ్యాధి నివారణకు పశు సంవర్ధకశాఖ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. వ్యాధి సోకిందని అనుమానం వచ్చిన వెంటనే దగ్గరలోని పశు వైద్యాధికారితో పరీక్షలు చేయించాలని పశు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ఉత్పాదక, రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో పశువు మరణానికి గురయ్యే ప్రమాదం ఉంది.

**వ్యాధి లక్షణాలు...**

- వ్యాధి సోకిన పశువుల్లో 104 డిగ్రీల జ్వరం ఉంటుంది.
- నోటిలో, పాదుగుపై, గిట్టల మధ్య, నాలుకపై బొబ్బలు ఏర్పడతాయి. అలా వచ్చిన బొబ్బలు 24 గంటల్లో చితికిపోతుంటాయి.
- చితికిన బొబ్బల వలన పుండ్లు ఏర్పడతాయి. పుండ్లపై బ్యాక్టీరియా వ్యాపించడంతో చీము పడుతుంది.
- కాళ్ల మీద పుండ్లు, బొబ్బల మూలంగా కుంటుకుంటూ నడుస్తుంటాయి.
- పాదుగు వాపునకు గురవుతుంది. వ్యాధి సోకిన పాదుగు నుంచి వచ్చిన పాలు తాగిన దూడలు మరణానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి కూడా తగ్గుతుంది.
- సూడి పశువుల్లో గర్భకోశ వ్యాధులు వచ్చే ప్రమాదముంది.

**వ్యాధి వ్యాప్తి ఇలా....**

- ఈ వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధిపీడిత పశువులను ఒకచోటి నుంచి మరొక చోటికి రవాణా చేయటం వల్ల కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.
- దేశవాళీ పశువుల కన్నా సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధిబారిన పడతాయి.
- లేగ దూడలకు ఈ వ్యాధి సోకితే త్వరగా మరణిస్తాయి.

**నివారణ ఇలా...**

పశువుకు నాలుగు నెలలు పైబడిన వయస్సులో వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలి. దీని వలన వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. తరువాత ఏటా ఈ టీకాలను క్రమం తప్పకుడా వేయిస్తుండాలి. ఏడాదిలో ఒక్కసారి టీకా వేయిస్తే ఏడాది మొత్తం వ్యాధి రాకుండా కాపాడుతుంది. ఈ వ్యాధి అన్ని సీజన్లలో వచ్చే ప్రమాదముంది. చూడి గేదెలకు ఈనిన తర్వాత టీకాలు వేయించడం ఎంతో మంచిది.

**చికిత్స విధానం**

గాలి కుంటు వ్యాధికి అందించే చికిత్స విధానాన్ని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ వివరించారు. వ్యాధి సోకిన పశువును తోటి పశువుల్లో కాకుండా వేరుగా ఉంచాలి. వ్యాధి ద్వారా వచ్చిన పుండ్లపై పోటాషియం పర్మాంగనేట్ కలిపిన నీటితో గాయాలను శుభ్రంగా కడగాలి. నోటి పుండ్లకు బోరో గ్లిజరిన్, కాలిపుండ్లకు బోరిక్ యాసిడ్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. పుండ్లపై ఈగలు వాలకుండా వేపనూనే పూయాలి. బొబ్బలు సోకిన పశువులకు తగిన సంరక్షణ లేకపోతే మరణించే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన పశువులు మేత సరిగ్గా మేయలేవు అందుకని వాటికి ప్రత్యేకంగా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని అందించాలి. జొన్న అన్నంలో కొద్దిగా బెల్లం, ఉప్పు కలిపి జావగా తయారుచేసి ప్రతిరోజూ పశువుకు ఇవ్వాలి.

**నియోజకవర్గంలో ఆవులు, గేదెల వివరాలు**

| మండలం | ఆవులు | గేదెలు | మొత్తం |
|---|---|---|---|
| ప్రత్తిపాడు | 2,935 | 11,372 | 14,307 |
| ఏలేశ్వరం | 2,440 | 9,302 | 11742 |
| శంఖవరం | 3,278 | 8,130 | 11,408 |
| రౌతులపూడి | 2,790 | 11,688 | 14,478 |
| మొత్తం | 11,443 | 40,492 | 51,935 |



ఎ.మల్లవరంలో పాడి పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

### వచ్చే నెల 18 వరకూ వ్యాక్సినేషన్



జాతీయ పశు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఆవులు, గేదెలకు వచ్చే నెల 18 వరకు టీకాలు వేస్తాం. కాకినాడ జిల్లాకు 3.15 లక్షల టీకాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న ఆవులు, గేదెలకు పశువైద్య సిబ్బంది టీకాలు వేస్తారు. పశుపోషకులు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించి తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలి. రైతులు తమకు దగ్గరలోని రైతు సేవాకేంద్రం, పశువైద్య సహాయకులు, పశువైద్యశాల, పశువైద్యాధికారులను సంప్రదించాలి.

– చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, ప్రత్తిపాడు

### పశువైద్యం అందుబాటులో ఉంది



గత ఐదేళ్లుగా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లోని పశువులకు వైద్య సేవలందుతున్నాయి. పశువులకు సరైన సమయానికి టీకాలు, వివిధ రకాల జబ్బులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. సకాలంలో పశువులకు చికిత్స చేయిస్తూ పశుసంపదను కాపాడుకుంటున్నాం.

– గొల్లు వెంకటరమణమూర్తి, పాడి రైతు, ఎస్.పైడిపాల, రౌతులపూడి మండలం

### పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



పశువులకు కాలానుగుణంగా సంక్రమించే వ్యాధులపై రైతులు వైద్యులు సూచనలు మేరకు జాగ్రత్తలు పాటించాలి. మెట్ట ప్రాంతంలో తరచుగా వచ్చే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. పశువుల్లో సంక్రమించే వ్యాధులను ముందుగా గుర్తించి సరైన వైద్యం అందిస్తే మూగజీవాలకు ఎటువంటి ముప్పు ఉండదు. పశువులు ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

– ఎం.వీర్రాఘవరావు, మండల పశువైద్యాధికారి, రౌతులపూడి

## గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారిగా ఆమె మండల పరిషత్ కార్యాలయానికి రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏలేశ్వరం నుంచి రౌతులపూడి వెళ్లే ఆర్టీసీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని ఎంపీటీసీలు కోరారు. రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యలను ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీఓ కుమార్ బాబు, ఈఓపీఆర్డీ విశ్వనాథ్, వైస్ ఎంపీపీ లొండ రత్నకుమారి, ఏపీఎం వెంకట్, ఓపీఓ కుమార స్వామి, ఎంఈఓ రాజబాబు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పెస్ట్ సర్వేలైన్స్ యాప్‌పై అవగాహన

జగ్గంపేట: స్థానిక వెలుగు భవనంలో మంగళవారం వ్యవసాయ సహాయ సంచాలకులు వై. గంగాధర్‌కుమార్ ఆధ్వర్యంలో పెస్ట్ సర్వేలైన్స్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీహరి మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా రైతులకు మేలైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి అనువుగా ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించిందన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో ఈ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ సంజీవ్, జగ్గంపేట, గండేపల్లి, ఏఓలు శ్రీరామ్, సద్గురుమూర్తి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



తునిలో పార్కును శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు అన్నారు. స్వచ్చతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక 23వ వార్డులోని పార్కును మంగళవారం మున్సిపల్ సిబ్బంది శుభ్రపరిచారు. పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి సుందరంగా తయారు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్య నిర్వహణకు పెద్దపీఠ వేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణలో పట్టణ ప్రజలంతా సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు. శానిటరీ ఇనస్పెక్టర్ శేఖర్, వార్డు కౌన్సిలర్ కర్రి శ్రీదేవి, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

## ఐఈఆర్పీలకు న్యాయం చేయాలని వినతి



శంఖవరంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న ఐఈఆర్పీలు

శంఖవరం: భవిత పాఠశాలల్లో మానసిక లోపం కలిగిన విద్యార్థులకు విద్యను భోధిస్తూ, వారికి సేవలందిస్తున్న ఐఈఆర్పీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తోట సీతారామయ్య అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయనకు మంగళవారం భవిత పాఠశాల ఐఈఆర్పీలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీలు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి భవిత పాఠశాలల్లో ఐఈఆర్పీలుగా పని చేస్తూ మానసిక లోపం ఉన్న విద్యార్థులకు సేవలందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం తమను ఏటా రెన్యువల్ చేసి విధుల్లో కొనసాగేలా చర్యలు తీసుకున్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి నియమ నింబధనలు విడుదల చేయకుండా తమను విధుల్లోంచి తొలగించాలని చూస్తోందన్నారు. గత ఏడాది మాదిరి అగ్రిమెంట్ నిబంధనలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్పీలు బి.నాగార్జున, డి.బ్రహ్మనందరావు పాల్గొన్నారు.

## సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా



మదర్‌థెరిసా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: సేవకు ప్రతిరూపం మదర్‌థెరిసా అని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక స్వామి వివేకానంద విద్యాసంస్థల్లో మంగళవారం మదర్ థెరిసా జయంతి వేడకలు నిర్వహించారు. తొలుత మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలు, అనాథలకు మదర్ థెరిసా చేసిన సేవలను కొనియాడారు. యువత మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

## హిందూధర్మం విశిష్టమైనది



మహాసభలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఏలేశ్వరం: హిందూధర్మం విశిష్టమైనదని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. వీహెచ్‌పీని స్థాపించి 60 ఏళ్ల పూర్తి కావడంతో స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో మంగళవారం రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా హిందూమతానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. హిందులంతా ఐక్యంగా ఉండాలన్నారు. సనాతన ధర్మాన్ని హిందూమతమే ఆచరిస్తుందన్నారు. వీహెచ్‌పీ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు చిక్కం సత్యనారాయణ, నడిశెట్టి తిరుపతి రావు, ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ తదితరులు పాల్గొన్నారు.

## తాండవ నీటి కోసం ఎదురు చూపులు



అల్లిపూడిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటనందూరు: తాండవ నీటికోసం మెట్ట గ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పటికీ మెట్ట గ్రామాలైన భీమవరపుకోట, ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట, బిళ్లనందూరు, ఇండుగపల్లి, జగన్నాథపురం, బొద్దవరం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాలు, ఆయకట్టు శివారు(ట్రైలాండు) ప్రాంతంలో పెద్దగా నాట్లు పడలేదు. ఈ గ్రామాల్లో వర్షపునీరు నిల్వ ఉండే పరిస్థితి లేకపోవడమే నాట్లు ఆలస్యానికి ప్రధాన కారణం. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా మండల వ్యాప్తంగా అరకొరగానే నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 10,400 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేస్తారనే అంచనాలుండగా ఇప్పటి వరకూ కేవలం 6,500 ఎకరాల్లో (70 శాతం) మాత్రమే నాట్లు పడినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తాండవనీరు శివారు పొలాలకు చేరితేనే పూర్తిస్థాయిలో నాట్లు పడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కాగా తాండవ ఆయకట్టు పరిధిలో భారీగా వర్షాలు పడినప్పటికీ ప్రాజెక్టు అధికారులు తక్కువ మొత్తంలో మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు.

## పోగొట్టుకున్న పర్స్ అందజేత



రైల్వే ప్రయాణికుడికి పోగొట్టుకున్న పర్స్ అందజేస్తున్న రైల్వే పోలీసులు

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్‌లో పర్స్ పోగొట్టుకున్న ప్రయాణికుడికి దానిని వెతికి అప్పగించినట్టు అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌త్రినాథ్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళానికి చెందిన ఓ ప్రయాణికుడు విజయవాడ నుంచి విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ అన్నవరం రైల్వే స్టేషన్‌లో దిగాడు. ఆ సమయంలో అతని పర్స్ పోవడంతో తుని రైల్వే ఎస్‌ఐ జి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. ఆ పర్స్‌లో నగదు, ఆధార్, బ్యాంకు క్రెడిట్, డెబిట్ కార్డులు ఉన్నట్లు తెలిపాడు. రైల్వే ఎస్‌ఐ ఆదేశాల మేరకు అన్నవరం రైల్వే పోలీసులు అన్నవరం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై పర్స్‌ను వెతికి బాధితుడికి అప్పగించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథ్ తెలిపారు.

## సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

తుని: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నుంచి జరిగే బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గంజి కొండలరావు పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని శ్రీసత్యసాయి సేవా మండలిలో తుని నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ అధ్యక్షతన మంగళవారం సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గంజి కొండలరావు సభ్యత్వ నమోదు విధివిధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోనే అత్యధిక సభ్యత్వ నమోదులు జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు ఆకెళ్ల శాస్త్రి, కాదంబర రామకృష్ణ, కర్రి శ్రీనివాసరావు, సుర్ల రమణ, మనిమల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు సరిచేసేందుకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో మెయిన్ రోడ్డులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలోని ఓ ప్రైవేటు బిల్డింగ్ వద్ద వైర్లు కిందకు వేలాడుతూ ఉండటంతో ఇటీవల ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. దీనిపై 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో కొత్తగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి వైర్లను సరి చేసేందుకు చర్యలు తీసుకున్నారు.



దానవాయిపేటలో ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభం